
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం ౹ 12 ౹ మార్చి ౹ 2023



పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సింగరేణిలో 61 ఎగ్జిక్యూటివ్, 199 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల (ఇంటర్నల్) భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. 10లో



హృదయమా.. పదిలమేనా ?!

గతంలో 50, 60 ఏళ్లు దాటితేనే గుండె పోటు వస్తుందనే భావన ఉండేది. కానీ ప్రస్తుతం వయోభేదం ఉండడం లేదు. 8లో

గరిష్టం / కనిష్టం 38° / 19°

వాతావరణం

జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి పూట కూడా చలి కొంత తగ్గుముఖం పడుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. ఆ తర్వాత విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆర్జిత సేవల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామి వారికి శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భగుడిలోని స్వామి మూల విరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించాక రెండు తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన భక్తుల సమక్షాన నిత్య కల్యాణం జరిపించారు. అలాగే, అర్చకులు, భక్తులు శ్రీవారికి పల్లకీ సేవ చేశారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జాతీయ సమావేశానికి 'వేల్పుల'



ఏఐటీయూసీ రాష్ట్ర ప్రతినిధులతో మల్లికార్జున్

అశ్వాపురం: మహారాష్ట్రలోని సంగ్లీ నగరంలో జరుగుతున్న ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ కమిటీ సమావేశాలకు మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన వేల్పుల మల్లికార్జున్ హాజరయ్యారు. భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి పట్ల కేంద్రం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై ఈ సమావేశాల్లో చర్చిస్తామని, కార్మికుల పక్షాన పోరాటాలు నిర్వహించేందుకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నామని ఈ సందర్భంగా మల్లికార్జున్ తెలిపారు. ప్రస్తుతం ఆయన ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శిగా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

ఒకటో తేదీనే వేతనాలు ఇవ్వాలి

ఖమ్మం సహకారనగర్/కూసుమంచి: ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతీనెలా ఒకటో తేదీనే వేతనాలు ఇవ్వాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 11వ తేదీన వచ్చినా జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి 1వ తేదీనే వేతనాలు చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోత్కూరి మధు, ఆర్.రంగారావు, టీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గట్టిగుండ్ల దర్గయ్య, కట్ట అనిల్‌కుమార్ వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు.

నేడు సత్తుపల్లిలో 'పొంగులేటి' సమ్మేళనం

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరగనుంది. సత్తుపల్లి ఎం.ఆర్ గార్డెన్స్ ఎదురుగా ఉన్న మైదానంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. సాయంత్రం 5గంటలకు సమ్మేళనం ప్రారంభం కానుందని పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి తెలిపారు.

ఏజెన్సీలో కలకలం !



రమేష్ హత్యకు గురైన చర్ల మండలం క్రాంతిపురం గ్రామ వ్యూ..

పక్కా ప్లాన్‌తోనే సప్కా రమేష్ హత్య

- చర్ల ఘటనలో మావోల పాత్రపై సందేహాలు
- మిలీషియా టీం రంగంలోకి దిగిందా ?
- కొత్త వ్యూహాలకు పదును పెడుతున్నారా అనే అనుమానాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: చర్లలో గురువారం అర్ధరాత్రి జరిగిన ఆదివాసీ యువకుడి దారుణ హత్యలో మావోయిస్టుల హస్తం ఉండొచ్చనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ఇక్కడ జరిగిన హత్యల తీరు, మృతుల నేపథ్యం తదితర అంశాలు ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి.

పక్కా ప్రణాళికతోనే దాడి..

చర్ల మండలం సుబ్బంపేట పంచాయతీ పరిధి ఆదివాసీ గూడెమైన క్రాంతిపురం(రాజయ్యనగర్)లో హత్యకు గురైన సప్కా రమేష్ గతంలో ఇరవై ఏళ్ల పాటు ఛత్తీస్‌గఢ్‌లో నివసించాడు. ఆ సమయంలో మావోయిస్టులు – భద్రతా దళాలు/ పోలీసులకు మధ్య జరిగిన పోరులో అనేక ఇబ్బందులు పడ్డాడు. దీంతో అక్కడ ప్రశాంత జీవితం గడపలేక, పదిహేనేళ్ల క్రితం తెలంగాణకు వలస వచ్చి ఆదివాసీ గూడెమైన క్రాంతిపురంలో నివసిస్తున్నాడు. జీవనాధారం కోసం పోడుసాగు, కూలీ పని చేసుకుంటున్నాడని గ్రామస్తులు చెబుతున్నారు. హత్యకు దారి తీసే స్థాయిలో అతనికి ఎవరితోనూ వ్యక్తిగత వివాదాలు కూడా లేవని తెలుస్తోంది. అయినప్పటికీ పక్కా ప్లాన్‌తో ఐదుగురు వ్యక్తులు ముసుగులు వేసుకుని నల్లని దుస్తులు ధరించి కత్తులతో పొడిచి దారుణంగా చంపేశారు.

మావోయిస్టుల హస్తం ఉందా..?

పకడ్బందీ ప్రణాళికతో జరిగిన రమేష్ హత్య వెనుక మావోయిస్టుల హస్తం ఉందా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఎందుకంటే ఇదే గ్రామానికి వలస వచ్చిన మడవి రమేష్‌ను సైతం రెండేళ్ల క్రితం ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హతమార్చారు. అప్పుడు కూడా అర్ధరాత్రి సమయంలో సుమారు పది మంది వ్యక్తులు గ్రామంలోకి ప్రవేశించారు. ఇంట్లో నిద్రిస్తున్న రమేష్‌ను లేపి, కత్తులతో పొడిచి చంపేశారు. ఈ హత్యకు వ్యక్తిగత కక్షలు కారణమని ముందుగా అనుమానించారు. అయితే పోలీసుల విచారణలో ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు చంపినట్టుగా తేలింది.

తుపాకులు కాదు.. కత్తులే

ఈ రెండు హత్యల్లోనూ తుపాకులు వంటి ఆయుధాలు కాకుండా కత్తులు ఉపయోగించారు. మావోయిస్టు పార్టీ మిలీషియా సభ్యులు తుపాకులకు బదులు కత్తులు, విల్లంబులు, కర్రలు వంటి సంప్రదాయ ఆయుధాలనే దాడుల్లో ఉపయోగిస్తుంటారు. రమేష్‌ను హత్య చేసేందుకు వచ్చిన ఐదుగురు వ్యక్తులు నల్లని దుస్తులు ధరించి ఉన్నారని, ముఖాలు కనిపించకుండా ముసుగులు వేసుకున్నారని, తమ వెంట కత్తులు తెచ్చుకున్నారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. దీంతో ఈ హత్యల వెనుక మిలీషియా సభ్యుల హస్తం ఏమైనా ఉందా అనే అనుమానాలు వస్తున్నాయి. భద్రతా దళాల నిఘా ఎక్కువగా ఉండడంతో తుపాకుల వంటి ఆయధాలు ఉపయోగించడం కష్టం. దీంతో ఆ పార్టీకి దండకారణ్యంలో అండగా ఉన్న మిలీషియా గ్రూపులను రాష్ట్ర సరిహద్దుల్లో యాక్టివేట్ చేస్తూ పార్టీని విస్తరించడమే మావోయిస్టుల వ్యూహమా అనే చర్చ జరుగుతోంది. ఛత్తీస్‌గఢ్‌లో అమలు చేస్తున్న మిలీషియా రణనీతిని తెలంగాణకు విస్తరించే పనిలో మావోయిస్టులు ఉన్నారనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. రెండేళ్ల కిందట తొలిసారి ఈ తరహా అనుమానాలు రాగా ఇప్పుడు చర్ల హత్యతో అవి మరింతగా బలపడుతున్నాయి.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు..

- ఎస్పీ డాక్టర్ వినీత్ అభినందన
- పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ముగిసిన మహిళా దినోత్సవ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మహిళా పోలీసులు.. చిత్రంలో ఎస్పీ వినీత్ దంపతులు

కొత్తగూడెంరూరల్: ప్రస్తుత సమాజంలో మహిళలు పురుషులతో పాటు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. హేమచంద్రాపురంలోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఈనెల 8న ప్రారంభమైన మహిళా దినోత్సవ వేడుకలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి సతీ సమేతంగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ.. ముఖ్యంగా పోలీస్ శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించడానికి కుటుంబంలో ఉండే మహిళల సహాయ సహకారాలే కారణమని అన్నారు. నిరంతరం విధుల్లో నిమగ్నమై ఉంటూ కుటుంబసభ్యులతో ఎక్కువ సమయం గడపలేకపోయినా.. అర్థం చేసుకుని అండగా ఉంటున్న మహిళలకు ధన్యవాదాలు తెలిపారు. మహిళలు వారి సాధికారత కోసం పాటుపడుతూనే సమాజంలో కొత్త మేలు కొలుపును తీసుకొస్తున్నారని అభినందించారు. బాలికలు విద్యార్థి దశ నుంచే స్వీయ సంరక్షణతో పాటు సామాజిక అవగాహన పెంపొందించుకుని దేశ భవిష్యత్‌కు బాసటగా నిలవాలని కోరారు. అనంతరం మూడు రోజులుగా నిర్వహించిన క్రీడలలో విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. పోలీస్ శాఖలో 30 సంవత్సరాలుగా సేవలందిస్తున్న మహిళా అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) టి.సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోష్, డీఎస్పీలు రెహమాన్, రమణమూర్తి, రాఘవేంద్రరావు, ఏఆర్ డీఎస్పీ విజయ్ బాబు, ఆర్ఐలు కామరాజు, సోములు, ప్రసాద్, దామోదర్, సుధాకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చకచకా చలువ పందిళ్ల నిర్మాణం



ఆలయ పరిసర వేసిన చలువ పందిళ్లు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవ ఏర్పాట్లలో భాగంగా చలువ పందిళ్ల నిర్మాణం చకాచకా జరుగుతోంది. ఆలయ ప్రాంగణంలో, చిత్రకూట మండపం వద్ద ఇప్పటికే పూర్తయ్యాయి. విస్తా కాంప్లెక్స్ ఎదురుగా, నూతన తాత్కాలిక యాగశాల నిర్మాణ ప్రాంతాల్లో పందిళ్ల ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు స్టేడియంలోనూ బారికేడ్ల ఎత్తు పెంపు పనులు శరవేగంగా సాగుతున్నాయి. తానీషా కల్యాణ మండపంలో 180 క్వింటాళ్ల తలంబ్రాలను సిద్ధం చేస్తున్నారు.

కరెంట్ పోతే ఖతమే

- ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో నిలిచిన వైద్య చికిత్సలు
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు సేవలు బంద్
- ఆస్పత్రిలో అందుబాటులో లేని జనరేటర్
- సోలార్ సిస్టమ్ ఉన్నా నిరుపయోగమే..



ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రి (ఇన్‌సెట్) ఆస్పత్రిలో కరెంట్ లేక మూతపడిన ఎక్స్‌రే యూనిట్



ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిని 'కరెంట్ కష్టాలు' వెంటాడుతున్నాయి. డీఎంహెచ్‌ఓ పరిధిలో ఉన్న ఈ ఆస్పత్రిని గతేడాది నవంబర్‌లో అప్‌గ్రేడ్ చేసి వైద్య విధాన పరిషత్ ఆధీనంలోకి తీసుకొచ్చారు. ఎక్స్‌రే, రేడియాలజిస్ట్, బేబీ కేర్ సెంటర్, ల్యాబ్ తదితర సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆస్పత్రిలో 30 పడకలే ఉన్నప్పటికీ.. ఓపీ సంఖ్య నిత్యం 700 నుంచి 800 వరకు ఉంటోంది. ఏ చిన్న అనారోగ్య సమస్య ఎదురైనా గతంలో ఖమ్మం లేదా కొత్తగూడెం వెళ్లే ఈ ప్రాంత ప్రజలు.. ప్రస్తుతం ఇల్లెందు ఆస్పత్రికే వస్తున్నారు. నిపుణులైన వైద్యులు కూడా ఉండడంతో మెరుగైన సేవలు అందుతున్నాయి. ఇవన్నీ బాగానే ఉన్నా.. విద్యుత్ లేకపోతే మాత్రం ఈ సేవలన్నీ ఆగిపోతున్నాయి. శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులతో విద్యుత్ సరఫరా నిలిపేశారు. దీంతో ఆస్పత్రిలో సేవలన్నీ నిలిచి రోగులు పలు ఇబ్బందులు పడ్డారు. బాలింతల ఐసీయూ గదితో పాటు ఇతర వార్డుల్లో ఫ్యాన్లు పని చేయక ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. బోరు పనిచేయక నీటి ఎద్దడి ఏర్పడింది.

జనరేటర్ లేక ఇక్కట్లు..

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో జనరేటర్ లేకపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా కుటుంబ నియంత్రణ, ప్రసూతి, ఇతర శస్త్రచికిత్సలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఆపరేషన్లు ఆగిపోయే ప్రమాదం ఏర్పడుతోంది. ఇక రేపోమాపో డయాలసిస్ సెంటర్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ సెంటర్ నడవాలంటే కరెంటుతో పాటు అనుబంధంగా జనరేటర్ సదుపాయం ఉండాలి.

పని చేయని సోలార్..

డీఎంహెచ్‌ఓ పరిధిలో ఉన్న కాలంలోనే ఇక్కడ 16 సోలార్ బ్యాటరీలు ఏర్పాటు చేశారు. అయితే నిర్వహణ సక్రమంగా లేక ఏడాది కాలంగా ఇవి పని చేయడం లేదు. దీంతో సోలార్ వెలుగులు కూడా అందక అంధకారంలోనే మగ్గాల్సి వస్తోంది. సోలార్ సిస్టమ్ ఉంటే కనీసం గంట, రెండు గంటలు విద్యుత్ సరఫరా నిలిచినా ఇబ్బంది ఉండేది కాదని, అటు జనరేటర్ లేక, ఇటు సోలార్ బ్యాటరీలు పని చేయక సమస్యలు తప్పడం లేదని వైద్యులు అంటున్నారు.


జనరేటర్ కోసం ప్రతిపాదించాం



ప్రభుత్వ వైద్యశాలలో 24 గంటలూ విద్యుత్ సరఫరా ఉండాలి. కరెంట్‌తో పాటు జనరేటర్, సోలార్ సిస్టమ్ కూడా ఉండాలి. జనరేటర్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

– శిరీష్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

పాల్వంచలో ఎత్తయిన కొండపై గల వేంకటేశ్వర స్వామి ఆలయం



సండే స్పెషల్

భక్తులకు గురి.. శ్రీనివాస గిరి..

- కోర్కెలు తీర్చే దైవమని నమ్మకం
- దినదినాభివృద్ధి చెందుతున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం
- తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి చెందుతున్న గుట్ట
- ఈనెల 17 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వేంకటేశ్వర స్వామి కల్యాణానికి హాజరైన భక్తులు(ఫైల్)

పాల్వంచ : ఇది కాకతీయుల కాలం నాటి ప్రాచీన ఆలయం. ఎత్తయిన కొండపై ఆదిశేషుడి పడగలా ఏర్పడిన ఏకశిలా బిలంలో స్వయంభువుగా వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తులను అనుగ్రహిస్తున్నట్టుగా కనిపిస్తాడు. 600 అడుగుల ఎత్తున ఉన్న గుహలో స్వామివారు వేంచేసి ఉండడం ఇక్కడి మరో ప్రత్యేకత. పాల్వంచ పట్టణంలోని శ్రీనివాస గిరిపై వెలసిన ఈ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడిని దర్శించాలంటే 1500 మెట్లు ఎక్కాల్సిందే. గతంలో ఆదరణకు నోచుకోని ఈ పురాతన గుట్ట.. ఆలయ కమిటీ ఏర్పాటు తర్వాత దినదినాభివృద్ధి చెందుతోంది.

ప్రాచీన చరిత్రకు ఆనవాళ్లుగా..

శ్రీనివాస గిరి ఆలయం ప్రాచీక చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తోంది. ఈ గుట్టకు దక్షిణ, తూర్పు భాగంలో ప్రవహిస్తున్న మొర్రేడు వాగు సమీపంలో రామచంద్రాపురం అనే గ్రామం ఉండేది. ఈ గ్రామానికి సమీపంలో కాకతీయుల కాలంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించారు. రాజులు, సంస్థానాధీశుల ఆధ్వర్యంలో కొంతకాలం ఘనంగా పూజలు జరిగాయి. ఆ తర్వాత కాలక్రమంలో ఈ ఆలయంలో పూజాధికాలు లేక గుడి శిథిలావస్థకు చేరింది. ఇలా గుడి పాడుబడడంతో రామచంద్రాపురం పేరు గుడిపాడుగా మారిందని స్థానికులు చెబుతుంటారు. కొంతకాలం తర్వాత గుహలో మట్టి నిండుకుని నీటి చుక్కలు పడుతుండేవని, అడవికి వెళ్లిన బాటసారులు దాహార్తి తీర్చుకునేందుకు గుహ వైపు వెళ్లగా, నీటి చుక్కలు పడే చోట రాతిపై మట్టి కరిగి స్వామి వారి రూపం ప్రాక్షికంగా కనపడిందని, అనంతరం గ్రామస్తులు గుహను సందర్శించి శుభ్రం చేసి స్వామి వారికి పూజలు చేయడం ప్రారంభించారని భక్తులు చెబుతున్నారు.

భక్తుల సహకారంతో..

శ్రీనివాసగిరి అభివృద్ధికి 2017లో కమిటీ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి దాతల సహకారంతో పలు పనులు చేపట్టారు. 600 అడుగుల ఎత్తున ఉన్న స్వామివారిని దర్శించుకోవాలంటే నాడు చాలా కష్టంగా ఉండేది. ప్రస్తుతం కమిటీ ఆధ్వర్యంలో రాళ్లను చెక్కి 1500 మెంట్లు నిర్మించారు. తాగునీటి వసతి, షెడ్లు, విశ్రాంతి భవనం, ముఖ ద్వారం, గోపురం, యాగశాల, కల్యాణ మండపం, గోశాల, గర్భగుడి చుట్టూ నీడ కోసం రేకుల షెడ్డు నిర్మించారు. గుట్టపైకి రోడ్డు నిర్మాణానికి సైతం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఇటీవలే నిధులు మంజూరు చేశారు.

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



శ్రీనివాస గిరి గుట్టపై ప్రతి ఏటా అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహిస్తుంటాం. స్వామివారి కల్యాణ మహోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వస్తుంటారు. అందరి సహకారంతో ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో గుట్టపైకి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఆరుట్ల లక్ష్మణాచార్యులు, భక్త సమాజ మండలి అధ్యక్షుడు

ప్రాచీన ఆలయంగా పేరు



కాకతీయుల కాలం నాటి ఆలయంగా ఈ గుట్టకు పేరుంది. ఆలయం అంత ఎత్తున ఉన్నా నిత్యం భక్తులు వస్తూనే ఉంటారు. ఈనెల 17 నుంచి నాలుగు రోజుల పాటు కల్యాణ మహోత్సవాలు కనులపండువగా జరుగుతాయి. ఉత్సవాలకు ప్రారంభ సూచికగా ఆదివారం పసుపు దంచే కార్యక్రమాన్ని చేపడుతున్నాం.

– నగేశ్ కుమార్ శర్మ, ఆలయ ప్రధానార్చకుడు

వేడుకలకు వేళాయె..

శ్రీనివాస గిరి గుట్టపై ప్రతి సంవత్సరం శ్రీ దేవీ, భూదేవీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించేందుకు భక్తసమాజ మండలి ఆధ్వర్యంలో గత నెల రోజులుగా విశేష కృషి చేస్తున్నారు. స్వామివారి కల్యాణ తంతును వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తుంటారు. 18న వనపర్తికి చెందిన సౌమిత్రి రామాచార్యులు, హైదరాబాద్‌కు చెందిన హరిచార్యులు, తోలేటి నగేశ్ కుమార్, ఆరుట్ల ఫణి రాజాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరుగనుంది. 20న పట్టణంలో రథోత్సవం ఉంటుంది. ఈ వేడుకలకు సంబంధించి ఇప్పటికే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రత్యేక రథం ద్వారా ప్రచారం నిర్వహించారు. ఉత్సవాల ప్రారంభ సూచికగా నేడు పసుపు దంచే కార్యక్రమం నిర్వహించనున్నారు.



కల్యాణరథాన్ని ప్రారంభిస్తున్న భక్త సమాజ మండలి సభ్యులు

21న ఏన్కూరుకు జనచైతన్య యాత్ర

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు 'పోతినేని'




సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రావు

ఖమ్మంమయూరిసెంటర్: పేదలు, సామాన్యులను దోచి కార్పొరేట్ శక్తులకు ప్రజాధనాన్ని కట్టబెడుతున్న బీజేపీ ప్రభుత్వం నుంచి దేశాన్ని రక్షించుకునేందుకే సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన జన చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు వెల్లడించారు. ఖమ్మం సుందరయ్య భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనచైతన్య యాత్రలను ఈనెల 17న పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రారంభిస్తారని తెలిపారు. కాగా, కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చాక తర్వాత ధరల పెంపుతో పేదల జీవనం భారం కాగా.. కార్పొరేట్ల కోసం చట్టాలను కాలరాస్తున్నారని విమర్శించారు. ఈమేరకు యాత్రలో భాగంగా కేంద్రం వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఇక రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరడం లేదని ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 21న జనచైతన్య యాత్ర ఏన్కూరు మండలం వద్ద ఖమ్మం జిల్లాలోకి ప్రవేశిస్తుందని, ఐదు నియోజవర్గాల్లో 15 బహిరంగ సభలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు యర్రా శ్రీకాంత్, బుగ్గవీటి సరళ, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, భూక్యా వీరభద్రం, మాచర్ల భారతి పాల్గొన్నారు.

హృదయమా.. పదిలమేనా?!

ఆందోళన కలిగిస్తున్న గుండెపోటు మరణాలు

- యుక్త వయస్సులోనే తనువు చాలిస్తున్న పలువురు
- జీవన శైలి, ఆహారంలో మార్పులే కారణమంటున్న నిపుణులు
- తగిన జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు



సాధారణంగా గుండె నిమిషానికి 60 నుంచి 100 సార్లు కొట్టుకోవాలి. కానీ కొందరికి 250 సార్లు.. మరికొందరికి 60 కన్నా తక్కువ సార్లకు పడిపోతోంది. ఈ కారణంగా జిమ్‌ల్లో వ్యాయామం చేస్తూనే, డీజే పాటలకు నృత్యం చేస్తూనే కుప్పకూలుతున్నట్లు తెలుస్తోంది. గుండె కొట్టుకోవడంలో ఏర్పడే తేడాల కారణంగా రక్త సరఫరా నిలిచిపోవడం కూడా కుప్పకూలడానికి, మరణాలకు కారణమవుతోంది. – ఖమ్మం వైద్యవిభాగం

■ మధిర మండలం బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన కొట్టె మురళీకృష్ణ హైదరాబాద్‌లో గురువారం రాత్రి ఛాతినొప్పి వస్తోందంటూ కుప్పకూలి మృతి చెందాడు. త్వరలోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరాల్సి ఉన్న ఆయన మృతితో తల్లిదండ్రులు ఒక్కగానొక్క కుమారుడిని కోల్పోయారు.

■ పెనుబల్లి మండలం గణేషన్‌పాడు పంచాయతీకి చెందిన రైతు మెట్టుల అశోక్ శుక్రవారం సాగు పనులు చేస్తుండగానే గుండెపోటుతో కుప్పకూలాడు. ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స మొదలుపెట్టే లోగా కన్నుమూశాడు.

■ ఉపాధి నిమిత్తం హైదరాబాద్ వెళ్లిన గుండాల మండలం రోళ్లగడ్డ తండాకు చెందిన మూడ్ పాషా ఇంట్లో శుభకార్యం నిమిత్తం స్వగ్రామానికి రాగా, శుక్రవారం రాత్రి నిద్రలోనే గుండెపోటుతో మృతి చెందాడు.

ఎటాక్.. స్ట్రోక్ వేర్వేరు...

గుండె పనిచేయడం హఠాత్తుగా ఆగిపోవడాన్ని కార్డియాక్ అరెస్ట్ అంటారు. స్పృహ కోల్పోవడం, స్పందించకపోవడాన్ని కార్డియాక్ అరెస్టుకు ప్రధాన సంకేతాలుగా చెప్పొచ్చు. ఇక మెదడుకు రక్త సరఫరా ఆగిపోవటాన్ని హార్ట్ స్ట్రోక్ అని అంటారు. అయితే సాధారణంగా రక్తం గడ్డకట్టడం వల్ల గుండె పోటు సంభవిస్తుంది. రక్తం గడ్డ కట్టినప్పుడు, రక్తనాళాలు కుచించుకుపోయినప్పుడు గుండెకు రక్త సరఫరా అకస్మాత్తుగా ఆగిపోయి గుండెపోటు వచ్చి మరణం సంభవిస్తుంది.

■ బోనకల్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థి మరీదు రాకేష్ గుండెనొప్పి వస్తోందని చెప్పగా చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు.

ఇటీవల వెలుగుచూసిన ఘటనల్లో ఇవి కొన్ని మాత్రమే. గతంలో యాభై ఏళ్లు లేదంటే అరవై ఏళ్లు దాటితేనే గుండెపోటు వస్తుందనే భావన ఉండేది. కానీ ప్రస్తుతం వయోబేధం లేకుండా ఎవరికైనా గుండెపోటు వచ్చి ప్రాణాలపైకి తీసుకొస్తోంది. ఇటీవల కాలంలో గుండెపోటుతో మృతి చెందే వారి సంఖ్య జిల్లాలో నానాటికీ పెరుగుతోంది. వ్యాయామం చేస్తూ, నృత్యం చేస్తూనో, నడుచుకుంటూ వెళ్తున్న వారు అక్కడికక్కడే కుప్పకూలిపోతున్నారు. అప్పటివరకు ఆరోగ్యంగా, శారీరకంగా దృఢంగా ఉన్న వారికి సైతం గుండె ఆకస్మాత్తుగా ఆగిపోయి కన్నుమూయడం కుటుంబాల్లో విషాదాన్ని నింపుతోంది. కొందరిని వైద్యుడి వద్దకు తీసుకెళ్లేలోగా ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఈ ఆకస్మిక మరణాలను సామాజిక మాధ్యమాలు, మీడియా ద్వారా తెలుసుకుంటున్న ప్రజలు భయభ్రాంతులు గురువుతున్నారు. ఎప్పుడు ఎవరికి ఏమవుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోస్ట్ కోవిడ్ కూడా కారణమేనా?

అకస్మికంగా చోటు చేసుకుంటున్న గుండెపోట్లకు కోవిడ్ కూడా ఓ కారణం కావొచ్చని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కోవిడ్ అనంతర పరిణామాలు కొంత మేర ప్రభావం చూపించే అవకాశముంటుందని చెబుతున్నారు. రక్త నాళాలు కుచించుకుపోవడానికి, రక్తం గడ్డకట్టటానికి పోస్ట్ కోవిడ్ పరిస్థితులు దోహదం చేసే అవకాశముందని తెలుస్తోంది. అలాగే జీవన శైలిలో మార్పులు కూడా గుండె సంబంధిత వ్యాధులకు ప్రధాన కారణంగా చెప్పొచ్చు.

ఆహార అలవాట్లలో మార్పులు..

ముఖ్యంగా ఇటీవల యువత ఎక్కువగా జంక్ ఫుడ్‌కు అలవాటయ్యారు. దీంతో ఆ ప్రభావం శరీ రంలోని అవయవాలపై పడి చిన్న వయస్సులోనే బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. దీనికి తోడు మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లు కూడా చిన్న వయస్సులోనే గుండె జబ్బులకు కారణమవుతున్నాయి. ఆధునిక జీవన శైలికి అలవాటు పడిన మనిషి పూర్తిగా శారీరక శ్రమ మర్చిపోయాడు. వ్యా యామం లేకపోవటం కూడా శరీరం వ్యాధుల బారిన పడడానికి ఓ కారణంగా నిలుస్తోంది.

యుక్త వయస్సులోనే తనువు చాలింపు..

ప్రస్తుతం జిల్లాలో చోటు చేసుకుంటున్న అకస్మిక గుండెపోటు మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. చిన్న వయస్సులో ఆకస్మికంగా కుప్పకూలిపోయి పలువురు తనువు చాలిస్తున్నారు. ఇటీవల కాలంలో ఘటనలు ఎక్కువయ్యాయి. ఇంటర్, డిగ్రీ చదువుతున్న కుర్రకారే కాకుండా అంతకంటే చిన్న వయస్సు వారు కూడా గుండెపోటుతో మృతి చెందటం భయభ్రాంతులకు గురిచేస్తోంది. కాగా, మారిన జీవనశైలి, వృత్తి, ఇతర అంశాల్లో పెరుగుతున్న ఒత్తిడి కారణంగా గుండె సంబంధిత అనారోగ్యంతో మరణాల సంఖ్య పెరగటానికి కారణమని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అలాగే, నియమిత ఆహారం తీసుకోకపోవడం, శారీరక శ్రమ లేని జీవన శైలి కూడా కారణాలేనని చెబుతున్నారు.

తగిన జాగ్రత్తలు తప్పనిసరి..



జీవన శైలిలో మార్పుల మూలంగా గుండె జబ్బులకు గురయ్యేవారు పెరుగుతున్నారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ మితమైన ఆహారం తీసుకోవడం, కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్స్ ఉండేలా ఆహారాన్ని జీవితంలో భాగం చేసుకోవాలి. మద్యం, సిగరెట్లకు దూరంగా ఉండాలి. ప్రతీరోజు కనీసం 30 నిమిషాలైనా వ్యాయామం చేయాలి. ఇటీవల చోటు చేసుకుంటున్న మరణాలకు పోస్ట్ కోవిడ్ లక్షణాలు కొంత మేర కారణం కాగా.. జీవన శైలిలో వచ్చే మార్పులు, ఒత్తిడి తదితర అంశాలే ఎక్కువగా ప్రభావం చూపిస్తున్నాయి. మరికొందరికి ఊపిరితిత్తులు, మెదడులో రక్తసరఫరా నిలిచిపోతుంది. కొందరు వ్యాక్సిన్ మూలంగా ఇలాంటి పరిణామాలు సంభవిస్తున్నాయని అపోహలకు గురవుతున్నారు. కానీ ఇప్పటివకు ఈ విషయం నిర్ధారణ కాలేదు.

– డాక్టర్ సీతారాం, గుండె వైద్య నిపుణులు, ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

క్లుప్తంగా

తూకంలో మోసంపై పోలీసులకు ఫిర్యాదు

దుమ్ముగూడెం: పత్తి కాంటా విషయంలో మోసం జరిగిందంటూ బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన మండలంలోని నడికుడి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నడికుడి గ్రామానికి చెందిన సోయం రత్తయ్య పత్తి పంట పండించగా.. గత ఐదు రోజుల క్రితం ఓ పత్తి వ్యాపారి కొనుగోలు చేశాడు. ఆ సమయంలో పత్తిని కాంటా వేయగా.. ఎనిమిది క్వింటాలు తూకం వచ్చింది. ఈమేరకు సదరు వ్యాపారి రైతుకు డబ్బులిచ్చి పత్తిని కొనుగోలు చేసి తీసుకెళ్లాడు. తర్వాత తూకంలో మోసం జరిగిందని గ్రహించిన సదరు రైతు విషయాన్ని గ్రామంలోని పలువురికి తెలిపాడు. ఈక్రమంలో శనివారం కూడా అదే వ్యాపారి గ్రామంలోకి రావడంతో గ్రామస్తులు అడ్డగించి ప్రశ్నించడంతో పారిపోయారు. వ్యాపారి వాహనాన్ని వెంబడించి సీతారాంపురంలో పట్టుకుని బాధితుడిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

డెంగీతో బీటెక్ విద్యార్థి మృతి



మృతుడు ప్రణీత్

అశ్వాపురం: గత నాలుగు రోజుల క్రితం డెంగీతో బాధపడుతున్న ఓ బీటెక్ విద్యార్థిని ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అమెర్ద గ్రామానికి చెందిన బర్ల వెంకటేశ్వర్లు, భాయమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. వారిలో అన్న, అక్కకు వివాహం కాగా చిన్న కుమారుడు ప్రణీత్(22) కేఎల్ఆర్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గత నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. ప్రణీత్ డెంగీతో మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలపగా.. ఈ విషయమై వైద్యాధికారి సంకీర్తనను వివరణగా కోరగా జ్వరంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారని.. ఏ జ్వరం అని స్పష్టంగా తెలియదన్నారు. కూలీ నాలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వెంకటేశ్వర్లు కుటుంబానికి ప్రణీత్ బీటెక్ అనంతరం కుటుంబానికి అండగా ఉండే సమయంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కాగా, ఇటీవల అమెర్దలో జ్వరాలు విజృంభించడంతో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం, ఇంటింటి సర్వే నిర్వహించారు. డెంగీ జ్వరంతో యువకుడు మృతి చెందడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

అశ్వారావుపేట: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన దమ్మపేట మండలం కేంద్రంలోని బంజారా కాలనీలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారా కాలనీకి చెందిన ధరావత్ నాగేంద్రరావు(27) దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామానికి చెందిన నాగమణితో సహజీవనం చేస్తున్నాడు. నాగేంద్రరావు ఇటీవల మద్యానికి బానిసై ఇంటికి వస్తుండడంతో భార్య మందలించింది. అయినాశుక్రవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి రావడంతో నాగమణి తన ఇద్దరు పిల్లలతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. శనివారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చేసరికి నాగేంద్రరావు ఉరి వేసుకుని కనబడ్డాడు. దీంతో చుట్టుపక్కల వారు తల్లి లక్ష్మికి సమాచారం అందించారు. తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని.. పూర్తిస్థాయి విచారణ చేయాలని తల్లి ఫిర్యాదు చేయడంతో అదనపు ఎస్సై సీమా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లింట విషాదం..

గుండాల: అక్క కూతురు వివాహాన్ని సంబరంగా జరిపి అత్తగారింటికి పంపించాడు. తిరుగు ప్రయాణం అవుదామని అనుకున్న తరుణంలోనే గుండెపోటుతో మృతి చెందాడు. ఈ హృదయ విదారకమైన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రోళ్ళగడ్డతండా గ్రామానికి చెందిన మూడ్ పాషా(35) ఇటీవల హైదరాబాద్ వెళ్లి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, గత శుక్రవారం తన అక్క కూతురు వివాహ నిమిత్తం స్వగ్రామానికి వచ్చాడు. వివాహం జరిపించి మేనకోడలిని అత్తగారింటికి పంపించి రాత్రి నిద్రపోయాడు. అయితే మరుసటి రోజు బంధువులందరూ కలిసి హైదరాబాద్ తిరుగు ప్రయాణం ఉండటంతో కుటుంబసభ్యులు శనివారం ఉదయం అతన్ని నిద్రలేపడానికి ప్రయత్నించగా.. అప్పటికే మృతి చెందాడు. అప్పటి వరకు పెళ్ళిలో కలివిడిగా తిరిగిన వ్యక్తి హఠాత్తుగా మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కోతుల దాడిలో వ్యక్తికి గాయాలు

ఇల్లెందురూరల్: దుకాణం వద్ద పాల ప్యాకెట్ తీసుకొని ఇంటికి వెళ్తున్న ఓ వ్యక్తిని కోతులు గాయపరిచిన సంఘటన మండలంలోని కొమరారం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కొమరారం గ్రామానికి చెందిన ఎర్రోజు సుబ్బయ్య దుకాణంలో పాల ప్యాకెట్ కొనుగోలు చేసి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో కోతుల గుంపు సుబ్బయ్యను చూసి వెంటపడగా.. తన చేతిలోని పాల ప్యాకెట్‌ను వదిలేసి సమీపంలోని ఇంట్లోకి చొరబడ్డాడు. అయినా కోతులు వెంబడించి కాళ్ల భాగంలో స్వల్పంగా గాయపర్చగా.. ఆస్పత్రిలో చికిత్స పొందాడు.

బకాయిల రిక'వర్రీ'..

గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్న సహకార సంఘం ఉద్యోగులు



తొమ్మిదోమైలుతండాలో పర్యటిస్తున్న సొసైటీ ఉద్యోగులు

టేకులపల్లి: బేతంపూడి సహకార సంఘం నుంచి రుణాలు తీసుకుని వాయిదాలు చెల్లించని వారి నుంచి బకాయిలు వసూళ్లు చేసేందుకు బేతంపూడి సహకారం సంఘం ఉద్యోగులు జప్తు చేసేందుకు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం ఆదేశాల మేరకు.. బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు సూచన ఆధారంగా సొసైటీ ఉద్యోగులు మండలంలోని తొమ్మిదోమైలుతండా, బేతంపూడి, కొత్తతండా(పీ) తదితర బకాయి ఉన్న గ్రామాల్లో రికవరీ కోసం మైకు ద్వారా ప్రచారం చేస్తూ వసూలు చేస్తున్నారు. 2016–17లో 80 మంది రైతులు గేదెల కోసం రూ.48 లక్షలు, 63 మంది బైక్ కొనుగోలుకు రూ.53లక్షలు మొత్తం 143 మంది రూ.101లక్షలు రుణాలు తీసుకున్నారు. వీరు 2017–18 లోపు రుణాలు చెల్లించాల్సి ఉండగా.. సకాలంలో చెల్లించకపోవడంతో డీసీసీబీ నుంచి ఒత్తిడి పెరిగడంతో వసూళ్లు మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో 108 మంది నుంచి రూ.57 లక్షలు వసూళ్లు కాగా ఇంకా 35 మంది నుంచి రూ.44 లక్షలు రావాల్సి ఉంది. రానున్న బకాయిల రికవరీ కోసం బేతంపూడి సొసైటీ సీఈఓ పానోజు ప్రేమాచారి, కందుల వెంకటేశ్వర్లు, హుస్సేన్, హీరాలాల్ బృందం గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి

మూడు నెలల్లో ఇది రెండో ఘటన



మృతి చెందిన దుప్పిని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

సత్తుపల్లిటౌన్: కుక్కలు వెంటబడి గాయపర్చడంతో ఓ దుప్పి మృత్యువాత పడింది. సత్తుపల్లిలోని అటవీశాఖ అర్బన్ పార్కు నుంచి ఎనిమిది నెలల వయస్సు గల దుప్పి ఇనుపకంచె దూకి సమీపంలోని జీడిమామిడి తోటల్లోకి వెళ్లింది. దీనిని గమనించిన వీధి కుక్కలు గౌరిగూడెం ఎస్సీకాలనీ వరకు వెంబడించి గాయపర్చగా తలకు బలమైన గాయాలు కావటంతో మృతి చెందింది. ఈ క్రమంలో స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎఫ్ఎస్ఓ నర్సింహా, ఎఫ్‌బీఓ ముక్తి వెంకటేశ్వర్లు చేరుకుని పోస్టుమార్టం అనంతరం పార్కులో దహనం చేశారు. దుప్పి తలపై కుక్కలు గాయపర్చటంతో రక్తస్రావమై మృతి చెందినట్లు ఎఫ్ఎస్ఓ తెలిపారు. కాగా, వేసవి కావడంతో దాహార్తిని తీర్చుకునేందుకు అర్బన్ పార్కు కంచె దూకుతున్న దుప్పులు సమీపంలో జీడిమామిడి తోటల్లోకి వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నాయి. జనవరిలో కూడా ఓ దుప్పి బయటకు రావడంతో వాహనం ఢీకొని మృత్యువాత పడింది. పార్కుకు ఏర్పాటుచేసిన ఇనుప కంచె ఎత్తు తక్కువగా ఉండడంతో దుప్పులు బయటకు వస్తున్న నేపథ్యాన అటవీశాఖ అధికారులు సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వారమైనా లభించని యువతి ఆచూకీ



కాల్వ వద్ద ఉన్న రూప తల్లి, కూలీలు

నేలకొండపల్లి: చెరుకు నరికేందుకు వచ్చిన యువతి సాగర్ కాలువలో గల్లంతై వారం దాటినా ఆమె ఆచూకీ తెలియరావడం లేదు. దీంతో ఆమె బంధువులు, సహచర కూలీలు దీనంగా కాల్వల కట్టలపై తిరుగుతూ ఆశగా ఎదురుచూస్తున్నారు. ఏపీలోని ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం గంగారానికి చెందిన కె.రూప (17) చెరుకు నరికే ముఠాలో కూలీగా నేలకొండపల్లి వచ్చింది. గత ఆదివారం సాయంత్రం రూప రాజేశ్వరపురం వద్ద సాగర్ కాల్వలో దూకినట్లు సహచర కూలీలు చెబుతూ గాలింపు చేపట్టారు. ఇంతలోనే ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు కూడా వచ్చి గాలింపు చేపట్టినా ఆచూకీ తెలియరాలేదు. రెండు రోజుల పాటు కాల్వ ప్రవాహం తగ్గించి గజ ఈతగాళ్లతో వెతికించినా ఆచూకీ లేదు. దీంతో రూప తల్లి నాగేంద్రమ్మ, బంధువులు రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టిస్తోంది. కాగా, రూప ఆత్మహత్యాయత్నం చేసిందా? లేక కూలీలు భ్రమపడ్డారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగానే ఆమె కాల్వలో దూకి ఉంటే వైరా రిజర్వాయర్ వరకు గాలించినా మృతదేహమైనా లభించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఏదిఏమైనా రూప ఆచూకీ కోసం ఆమె తల్లి, బంధువులు కాల్వ కట్టలపై జాగారం చేస్తున్నారు. ఈ విషయంలో నేలకొండపల్లి పోలీసులు రూప మేనమామను అదుపులోకి తీసుకుని విచారించినా ఫలితం లేకపోయింది.

గంజాయి స్వాధీనం...

మధిర: వరంగల్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో రైల్వే పోలీసులు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఎక్సైజ్, రైల్వే పోలీసులకు శనివారం అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మధిరలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రైలులో తరలిస్తున్న 18 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మధిర ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. కాగా, గంజాయిని రవాణా చేస్తున్న నిందితుల ఆచూకీ లభించలేదని వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఎస్సై శార్వాణి, జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డితో పాటు సిబ్బంది ఖాసీం, లాలు, గోపయ్య, వలరాజు, లాజర్, రియాజ్, ముస్తఫా, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆకర్షణీయం..!

హరితహారంలో భాగంగా సుజాతనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో నాటిన మొక్కలు ఎర్రపూలతో ఆకర్షణీయంగా ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రధాన రహదారిపై డివైడర్ మధ్యలో కడియం నర్సరీ నుంచి తీసుకొచ్చిన కాగితపు పూల మొక్కలను గతంలో నాటారు. ప్రస్తుతం ఇవి పూలు పూయడంతో.. వాహనదారులకు కనువిందుగా మారింది.

– సుజాతనగర్



డివైడర్ మధ్యలో పూసిన పూలు

ఎమ్మెల్యే కుమార్తెకు అన్నప్రాసన వేడుక



అన్నప్రాసన వేడుకలో హరిప్రియ దంపతులు

ఇల్లెందు: ఎమ్మెల్యే హరిప్రియ – హరిసింగ్ దంపతుల కుమార్తె 'రుద్ర భారతీ ప్రియ' అన్నప్రాసన వేడుక తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం జరిగింది. దైవ దర్శనం అనంతరం కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రవి– కల్పన దంపతులు, బయ్యారం వైస్ ఎంపీపీ తాతా గణేష్, 11వ వార్డు కౌన్సిలర్ జేకే శ్రీనివాస్, న్యాయవాది సతీష్, రామానాయక్, గిన్నారపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం ఏరియాలో ఆడిట్‌పై సమీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలో రీజియన్ ఆడిట్ కమిటీ బాధ్యులు శనివారం సమావేశమయ్యారు. కొత్తగూడెంలోని జీఎం కార్యాలయంలో సమావేశమైన వారు ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్లలో చేపట్టిన తనిఖీలు, రూపొందించిన ఆడిట్ నివేదికలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆడిట్ అధికారులు మాట్లాడుతూ గనులు, డిపార్ట్‌మెంట్లలో కంపెనీ నిబంధనలు పాటిస్తున్నారా, లేదా తరచుగా తనిఖీ చేస్తూ యాజమాన్యం దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈసమావేశంలో ఎస్ఓటూ జీఎం శ్రీరమేష్, ఏజీఎం సామ్యూల్ సుధాకర్, డీజీఎం రాజశేఖర్, అధికారులు ప్రశాంతి, రమేష్, ఏ.నాగేశ్వరరావు, లలిత, మురళి, జి.సుధాకర్, కె.దేవదాసు, విజయ్ సందీప్, అజయ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేను ఒక్క కాపులకే నాయకుడిని కాదు

- బీసీలకు అధికారం రావాలని పంతం పట్టా: పవన్‌కల్యాణ్



సాక్షి, అమరావతి: తాను ఒక్క కాపులకే నాయకుడ్ని కాదని, ఒక కులం పరిధిలోనే ఆలోచించేలా పెరగలేదని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ చెప్పారు. శనివారం మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన బీసీ నేతల సమావేశంలో ఆయన ప్రసంగించారు. సమావేశంలో కొందరు నాయకులు కాపులకు రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవసరమేంటని మాట్లాడటంపై ఆయన స్పందిస్తూ.. ఈ అంశాన్ని కాపుల నేతలతో సమావేశమైనప్పుడు వారి దృష్టికి తీసుకెళతానని చెప్పారు. బీసీలు ఎన్నికలప్పుడు రూ. 2 వేలకు ఓటును అమ్ముకుంటున్నారంటే వారికి ఆత్మాభిమానం లేక కాదని, ఆర్థిక పరిపుష్టి లేక అలా చేస్తున్నారని పవన్ అన్నా రు. బీసీలకు ఆర్థిక పరిపుష్టి ఏర్పడాలని, అందుకోసం ఆ కులాలకు అండగా ఉంటానని అ న్నారు. 'బీసీలకు అధికారం రావాలని నేను పంతం పట్టా. బీసీలతో కలిసి అధికారం పంచుకోవాలని కాపు నాయకులకూ చెబుతా' అని అన్నారు. ఎన్నికల సమయంలో బీసీలు కులాల వారీగా విడిపోకుండా బీసీ అభ్యర్థిని అందరూ కలిసి ఎందుకు గెలిపించుకోరని ప్రశ్నించారు. బీసీల సమస్యలపై ఒక రోజు రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తే తాను అండగా ఉంటానని, లేదంటే ఒక్క రోజు దీక్ష చేద్దామని చెప్పారు.

కాపులంతా కాపు సంక్షేమ సేనలో లేరు

పవన్ కల్యాణ్‌కు కాపు ఐక్య వేదిక బహిరంగ లేఖ

సాక్షి, అమరావతి: రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలగి, 80 ఏళ్ల వయస్సులో కాపు సంక్షేమ సేనను స్థాపించిన చేగొండి హరిరామ జోగయ్య భ్రాంతి నుంచి జనసేన బయట పడాలని కాపు ఐక్య వేదిక సూచించింది. కాపులంతా కాపు సంక్షేమ సేనలో లేరని స్పష్టం చేసింది. ఈ మేరకు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు కాపు ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ రావి శ్రీనివాస్ తదితరులు శనివారం బహిరంగ లేఖ రాశారు. 'జోగయ్యను నమ్మి చిరంజీవి పాలకొల్లులో ఓడిపోయారు. బీసీ, దళిత నాయకులను కలుస్తున్నట్టే కాపు సంఘాల నాయకులను మీరు ఎందుకు కలవడంలేదు? కాపు సంఘాల నాయకులను కలిస్తే కులం కార్డు వచ్చేస్తుందని భావిస్తే.. జోగయ్య నేతృత్వంలోని కాపు సంక్షేమ సేనను కలవడం వల్ల కులం కార్డు రాదా' అని కాపు ఐక్య వేదిక నేతలు ఆ లేఖలో పవన్‌ను ప్రశ్నించారు.

తోడు దొంగలు

▶ మొదటి పేజీ తరువాయి

రిజిస్ట్రేషన్ల శాఖ గత ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో సోదాలు నిర్వహించింది. రిజర్వ్ బ్యాంక్ నిబంధనలు, చిట్ ఫండ్ చట్టానికి విరుద్ధంగా ఆ సంస్థ అక్రమాలకు పాల్పడుతున్నట్టు గుర్తించింది. ఆ తనిఖీల్లో మార్గదర్శి చిట్ ఫండ్స్ బ్రాంచి మేనేజర్లు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులకు ఏమాత్రం సహకరించ లేదు. దాంతో అధికారులు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో గత ఏడాది డిసెంబర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మరిన్ని అక్రమాలు వెలుగు చూశాయి. చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ చందాదారుల హక్కులకు విఘాతం కలిగిస్తున్నారని ఆధారాలతో సహా నిర్ధారించారు. సంస్థ యాజమాన్యం తమ స్వప్రయోజనాల కోసం అక్రమాలకు పాల్పడుతోందని నిగ్గు తేల్చారు. దాంతో చందాదారుల హక్కుల పరిరక్షణ, రిజర్వ్ బ్యాంక్ నిబంధనలను అమలు చేయడం కోసం ఈ వ్యవహారాన్ని సీఐడీకి నివేదించారు. విశాఖపట్నం, కాకినాడ, ఏలూరు, విజయవాడ, గుంటూరు, పల్నాడు, కర్నూలు, అనంతపురం జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్లు ఈ మేరకు సీఐడీకి లిఖిత పూర్వకంగా సీఐడీ విభాగానికి ఫిర్యాదు చేశారు. దాంతో మార్గదర్శి చిట్ ఫండ్స్‌పై సీఐడీ కేసు నమోదు చేసింది. సీఐడీ అధికారులు విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, అనంతపురంలోని మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల్లో శనివారం సోదాలు నిర్వహించి మేనేజర్లను ప్రశ్నించారు. సోదాలు మొదలుపెట్టగానే నరసరావుపేట, ఏలూరు బ్రాంచి మేనేజర్లు పరారవ్వడం గమనార్హం. ఈ సోదాల్లో సీఐడీ అధికారులు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం కూడా సోదాలు కొనసాగించనున్నారు.

రికార్డుల నిర్వహణలో గూడు పుఠాణి

- మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో తాము గుర్తించిన అక్రమాలపై స్టాంప్స్– రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు మరింత లోతుగా పరిశీలించారు. మార్గదర్శి సంస్థ సమర్పించిన ఆర్థిక నివేదికల (ఫైనాన్సియల్ స్టేట్‌మెంట్స్)పరిశీలనకు ఓ చార్టెడ్ అకౌంటెంట్‌ను నియమించడం ద్వారా పలు అక్రమాలను గుర్తించారు.
- చిట్టీల వారీగా లాభనష్టాల ఖాతా, బ్యాలెన్స్ షీట్‌లను సక్రమంగా నిర్వహించడం లేదు.
- బ్యాలన్స్ షీట్‌లో నోట్ నంబర్ 7 కింద రూ.459.98 కోట్లు చూపించారు. కానీ పరిశీలించగా ఆ మొత్తాన్ని నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టినట్టు నిర్ధారణ అయ్యింది.
- మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థకు మూడు అనుబంధ కంపెనీలు ఉన్నట్టుగా బ్యాలన్స్ షీట్ నోట్ నంబర్ 40లో పేర్కొన్నారు. మార్గదర్శి చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్–చెన్నై, మార్గదర్శి చిట్స్ (కర్ణాటక) ప్రైవేట్ లిమిటెడ్–బెంగళూరు, ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్–హైదరాబాద్‌లను అనుబంధ కంపెనీలుగా చూపించారు. నిధులను నిబంధనలకు విరుద్ధంగా తరలించేందుకే ఇలా చేశారు. మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ ఆ మూడు అనుబంధ కంపెనీల్లో రూ.1,05,80,000 పెట్టుబడి పెట్టినట్టు బ్యాలన్స్ షీట్‌లో చూపించారు. కానీ ఆ కంపెనీల షేర్ హోల్డర్స్ జాబితా పరిశీలించగా.. ఒక్క ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లోనే 88.5 శాతం వాటాతో రూ.2 కోట్లు పెయిడ్ అప్ క్యాపిటల్‌గా పెట్టుబడి పెట్టినట్టు నిర్ధారణ అయ్యింది.
- చిట్ ఫండ్ కంపెనీలు ఇతర వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టడం చిట్ ఫండ్ చట్టం–1982కు విరుద్ధం. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు ఉన్న మూడు అనుబంధ కంపెనీలు అదే తరహా వ్యాపారంలో ఉన్నట్టుగా చూపించారు. కానీ ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ చిట్‌ఫండ్ వ్యాపారంలో లేదు. ఇది నిబంధనలకు విరుద్ధం. ఆ కంపెనీలో మార్గదర్శి చిట్ ఫండ్స్ 88.5 శాతం వాటా ఉంది. అంటే ఆ కంపెనీలో నిర్ణయాధికారం మార్గదర్శి సంస్థదే.

అక్రమ డిపాజిట్లు

మార్గదర్శి ఫైనాన్షియర్స్ దశాబ్దాలుగా అక్రమ డిపాజిట్లు సేకరిస్తూ వచ్చింది. ఆ సంస్థ కార్యాలయాల్లోనే 'మార్గదర్శి డిపాజిట్స్' అనే పేరుతో భారీగా అక్రమ డిపాజిట్లను సేకరించింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో దీనిపై ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేశారు. అప్పట్లో రిజర్వ్ బ్యాంక్ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించింది. దాంతో తాము తప్పు చేశామని రామోజీరావు లిఖిత పూర్వకంగా అంగీకరిస్తూ డిపాజిట్‌దారులకు వారి డిపాజిట్ మొత్తాలను వెనక్కి ఇచ్చేస్తున్నట్టు ప్రకటించారు. దాంతో మార్గదర్శి చిట్ ఫండ్స్ ఇక డిపాజిట్ల సేకరణను నిలిపి వేసిందని అంతా భావించారు. కానీ గుట్టుచప్పుడు కాకుండా ×రశీదు×ల రూపంలో అక్రమ డిపాజిట్లు వసూలు చేస్తున్నట్టుగా స్టాంప్స్–రిజిస్ట్రేషన్ల శాఖ ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో బహిర్గతమైంది.



ఏలూరు మార్గదర్శి కార్యాలయంలో అధికారుల తనిఖీలు

మార్గదర్శి అక్రమాలు ఇవీ..

- చందాదారులు నెలవారీ మొత్తం చెల్లించకపోయినా, వాయిదాల మొత్తం చెల్లించకపోయినా ఆ ఖాతాలను మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరుతో చూపించారు. అనంతరం నిబంధనలకు విరుద్ధంగా ఆ చీటీలను ఇతర వ్యక్తుల పేరుతో మార్పు చేశారు. ఇది నిబంధనలకు విరుద్ధం.
- చందాదారులు పాడిన చిట్ మొత్తాన్ని వారికి వెంటనే చెల్లించడం లేదు. ఆ మొత్తంపై 4 శాతం నుంచి 5 శాతం వరకు చందాదారునికి వడ్డీ చెల్లిస్తామని చెబుతూ ఓ రశీదు ఇస్తున్నారు. అంటే మార్గదర్శి సంస్థ ఆ చిట్ మొత్తాన్ని డిపాజిట్‌గా స్వీకరిస్తున్నట్టే. ఇది రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు విరుద్ధం. చిట్ ఫండ్ కంపెనీలు డిపాజిట్లు స్వీకరించడాన్ని చట్టం నిషేధించింది. అయినప్పటికీ మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా 'ప్రత్యేక రశీదు'ముసుగులో డిపాజిట్లు సేకరించింది.
- మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ ఆదాయ, వ్యయాల ఖాతాలు, ఆస్తి, అప్పుల నివేదికలు, పెట్టుబడుల నివేదికలను వెల్లడించకుండా గోప్యంగా ఉంచింది. ఇది చిట్ ఫండ్ చట్టంలోని సెక్షన్ 28 రెడ్‌విత్ 24 నిబంధనలకు విరుద్ధం.
- మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల నుంచి భారీగా నిధులను మార్గదర్శి ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ నిధులను మార్గదర్శి యాజమాన్యం మార్కెట్ రిస్క్ అత్యధికంగా ఉండే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడిగా పెట్టింది. ఇది చిట్ ఫండ్ చట్టానికి విరుద్ధం.

అనాథ బాలలకు ప్రభుత్వ భరోసా

ఆర్థికంగా, సామాజికంగా అభాగ్యులైన వారికి నెలకు రూ.4 వేలు

సాక్షి, అమరావతి: ఏపీలో మహిళా శిశు సంక్షేమానికి అనేక చర్యలు చేపడుతున్న ప్రభుత్వం అనాధలు, అభాగ్యులైన బాలలకు సైతం కొండంత భరోసా ఇస్తోంది. తల్లిదండ్రులను కోల్పోయిన వారు, తల్లిదండ్రులకు దూరమైన వారు, అనేక రకాల బాధిత పిల్లల విద్య, పౌష్టికాహారం, ఆరోగ్య అవసరాలతో పాటు సంరక్షణ, పునరావాసం కల్పించడంలో పెద్ద మనస్సుతో వ్యవహరిస్తోంది. ఇందుకోసం స్పాన్సర్‌షిప్, పోస్టర్ కేర్ వంటి పథకాల ద్వారా అర్హులైన బాలలు ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేలు సహాయం అందిస్తోంది. తాజాగా స్పాన్సర్‌షిప్ పథకం ద్వారా రాష్ట్రంలో 7,253 మంది పిల్లలకు ఏడు నెలలకు రూ.19,56,20,000, పోస్టర్ కేర్ ద్వారా మరో 20 మందికి 9 నెలలకు రూ.7,20,000 విడుదల చేసినట్టు ఏపీ మహిళా శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జి సంచాలకుడు బి.రవిప్రకాశ్‌రెడ్డి తెలిపారు. స్పాన్సర్‌షిప్ పథకంలో ఆర్థికంగా, సామాజికంగా బలహీనమైన బాలల విద్య, పోషకాహారం, ఆరోగ్య అవసరాల కోసం నెలకు రూ.4 వేలు ఆర్థిక సాయం అందిస్తారు. అలాగే పోస్టర్ కేర్ పథకంలో పిల్లల సంరక్షణ, పునరావాసం కోసం నెలకు రూ.4 వేలు ఆర్థిక సాయం అందిస్తారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

అన్ని నియోజకవర్గాల్లో పార్టీ జెండా ఎగురవేయాలని కేంద్ర కార్యాలయం పిలుపు

సాక్షి, అమరావతి: మార్చి 12న (నేడు) వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శాసనసభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్తలు ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో పార్టీ జెండాలు ఎగుర వేయాలని, దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు రంగులు వేసి, పూలమాలలతో అలంకరించాలని తెలిపింది. పలు సేవా కార్యక్రమాలతో వేడుకలు ఘనంగా నిర్వహించాలని సూచించింది. వైఎస్సార్‌సీపీ 12 వసంతాలు పూర్తి చేసుకుని మార్చి 12వ తేదీన 13వ సంవత్సరంలోకి అడుగు పెట్టనుంది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఎన్నో సవాళ్లను అధిగమించి, సంపూర్ణ ప్రజా బలంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం విదితమే. అధికారంలోకి వచ్చాక ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన దాదాపు అన్ని హామీలు అమలు చేయడమే కాక, చెప్పని వాటితో పాటు, అనేక సంక్షేమ – అభివృద్ధి కార్యక్రమాల అమలు ద్వారా ప్రజారంజక పరిపాలన సాగిస్తోంది.

ఆత్మగౌరవానికి ప్రతీక

- సవాళ్లనే సోపానాలుగా మల్చుకున్న వైఎస్సార్‌సీపీ
- 12 ఏళ్లలో తిరుగులేని శక్తిగా ఆవిర్భావం
- నేడు 13వ వసంతంలోకి అడుగులు
- విప్లవాత్మక కార్యక్రమాలతో వైఎస్ జగన్ ప్రజారంజక పాలన
- సంక్షేమాభివృద్ధి పథకాలతో రాష్ట్రం పరుగులు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మార్గదర్శి చిట్‌ఫండ్‌కు కమిషన్ వడ్డింపు

చిట్స్ మొత్తం చెల్లింపులో జాప్యం చేసినందుకు..

గుంటూరు లీగల్: చిట్స్‌కు సంబంధించిన వాయిదాల నగదును పూర్తిగా చెల్లించినప్పటికీ, ఆ చిట్స్ పూర్తయిన తరువాత ఆ మొత్తం చెల్లింపులో జాప్యం చేసినందుకుగానూ నష్టపరిహారం చెల్లించాల్సిందేనని మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను గుంటూరు జిల్లా వినియోగదారుల కమిషన్ ఇటీవల ఆదేశించింది. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన సీహెచ్ సుబ్బారావు 2007 సెప్టెంబర్ 27న మార్గదర్శి చిట్‌ఫండ్‌లో రెండు చిట్స్‌కు చందాదారుడిగా చేరాడు. ఒక్కో చిట్ విలువ రూ.2,50,000. యాభై నెలల కాల వ్యవధి. సుబ్బారావు రెండు చిట్స్‌కు పూర్తిగా నగదు చెల్లించాడు. 2010 అక్టోబర్ 20న చిట్ కాలవ్యవధి పూర్తయింది. దీంతో సుబ్బారావు తన డబ్బులు కోసం మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయంలో సంప్రదించాడు. సాంకేతిక కారణాలవల్ల డబ్బులు చెల్లించలేకపోతున్నట్లు సిబ్బంది తెలిపారు. దాదాపు తొమ్మిదేళ్ల పాటు బాధితుడు కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. అనంతరం బాధితుడి అకౌంట్‌లో నగదు జమచేసినట్లుగా 2019 నవంబర్ 2న రిజిస్టర్డ్ పోస్టు ద్వారా మార్గదర్శి సిబ్బంది తెలిపారు. తొమ్మిదేళ్ల తరువాత నగదు చెల్లించినందున ఆలస్యానికి నష్టపరిహారం చెల్లించాలని సుబ్బారావు కోరాడు. దీనికి తమ హెడ్డాఫీసు ఒప్పుకోవడంలేదని చిట్‌ఫండ్ సిబ్బంది తెలిపారు. సర్వీసు లోపం కింద నష్టపరిహారం ఇప్పించాలని ఫిర్యాదు సుబ్బారావు గుంటూరు జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. అసలు కమిషన్‌కు ఈ కేసును విచారించే అధికార పరిధి లేదని 'మార్గదర్శి'వాదించగా కమిషన్ దానిని తిరస్కరించింది. 2010 నుంచి 2019 వరకు ఐదు లక్షలకు 12 శాతం వడ్డీ చెల్లించాలని, మానసికంగా హింసించినందుకుగానూ రూ.2 లక్షలు నష్టపరిహారం, కోర్టు ఖర్చులు కింద రూ.10 వేలు చెల్లించాలని మార్గదర్శి చిట్‌ఫండ్‌ను ఆదేశిస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు టి.సునీత, కమిషన్ సభ్యులు కె. విజయలక్ష్మి, గుంటకల పున్నారెడ్డి తీర్పు చెప్పారు.

ఏపీలో 16 నుంచి వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: ఈసారి వేసవిలోనూ వర్షాలు పలకరించనున్నాయి. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు ఏపీలో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రం పైకి తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి గాలులు వీస్తున్నాయి. నాలుగు రోజుల్లో ఈ గాలులు దిశ మార్చుకుని దక్షిణ దిశ నుంచి వీచే అవకాశం ఉంది. దీని ప్రభావం 4 రోజుల పాటు ఉండనుంది. ఫలితంగా 16 నుంచి 20 వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ శనివారం నాటి బులెటిన్‌లో తెలిపింది.

జిల్లా వార్తలు

న్యూఢిల్లీలో ఎంపీపీల స్టడీ టూర్



ఢిల్లీలో నిరసన తెలుపుతున్న జిల్లా ఎంపీపీలు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఆహ్వానం మేరకు ఖమ్మం జిల్లాకు చెందిన ఎంపీపీల బృందం స్టడీ టూర్‌లో భాగంగా శనివారం న్యూఢిల్లీ చేరుకుంది. ఇండియాగేట్, రెడ్ ఫోర్ట్, లోటస్ టెంపుల్.. తదితర చారిత్రక ప్రదేశాలను సందర్శించిన వారు అక్కడి విశేషాలను తెలుసుకున్నారు. ఈ బృందంలో జిల్లాలోని ఎంపీపీలు సామినేని హరిప్రసాద్, దొడ్డా శ్రీనివాసరావు, ఎల్.వి.సీల్‌కుమార్, పగుట్ల వెంకటేశ్వరరావు, కోపూరి పూర్ణయ్య, బానోత్ శ్రీనివాస్, బోడ మంగీలాల్, భూక్యా గౌరి, భూక్యా లాల్యా, వజ్జా రమ్య, దొడ్డా హైమావతి, కోట పావని, మాలోత్ శకుంతల, దేవరకొండ శిరీష, కంకణాల సౌభాగ్యం, బానోత్ సునీత తదితరులు ఉన్నారు. ఆదివారం కూడా వారు ఢిల్లీ సమీప ప్రాంతాల్లో పర్యటించనున్నారు. కాగా, ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఎంపీపీలు ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద నిరసన తెలిపారు.

'ఖేలో ఇండియా' విజేత సాహితికి సన్మానం



వేముల సాహితిని సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంస్పోర్ట్స్: ఇటీవల నిర్వహించిన ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ టోర్నీలో ఖమ్మానికి చెందిన వేముల సాహితి కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా శనివారం ఆమెతో పాటు తల్లిదండ్రులను పలువురు సన్మానించి రూ.16 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ జిల్లా సభ్యుడు గుంతేటి వీరభద్రం, దుర్గ విరించి వైద్యశాల డైరెక్టర్ కిరణ్‌కుమార్, పే బ్యాక్ టు సొసైటీ వ్యవస్థాపకుడు జంగం లక్ష్మణ్‌రావు, సవ్వడి మొబైల్స్ యజమాని పి.శ్రీనివాస్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు లిక్కి కృష్ణారావు, తహసీల్దార్ ప్రకాష్‌తో పాటు జమ్మి జైపాల్, వల్లెపు సోమరాజు,ి రమ్య, మద్దెల విజయ్, ఫిరంగి రామదాసు, వి.రాజు, సాయిబాబు, డి.శ్రీనివాస్, కె.శ్రీనివాస్, కె.విజయ్, జి.బాబు, వెంకటేశ్వర్లు, రమేశ్, బాలస్వామి, ప్రభాకర్, కుటుంబరావు తదితరులు పాలొన్నారు.

260 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం

- సింగరేణిలో 61 ఎగ్జిక్యూటివ్, 199 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు
- ఈ నెల 13 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు



సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ 260 పోస్టుల (ఇంటర్నల్) భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో 61 ఎగ్జిక్యూటివ్ (ఆఫీసర్), 199 నాన్ ఎగ్జిక్యూటివ్ (కార్మికులు) పోస్టులు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 13 వరకు ఉందని యాజమాన్యం వెల్లడించింది. ఆ తర్వాత యూనిట్ స్థాయిలో ఈ నెల 16 వరకు, ఏరియా జీఎం ఆఫీస్‌కు ఈ నెల 20లోపు దరఖాస్తులు అందజేశాక, దరఖాస్తు హార్డ్‌కాపీలు, సర్టిఫికెట్లను ఈ నెల 25లోపు కార్పొరేట్ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని యాజమాన్యం సూచించింది.

పోస్టుల వివరాలు ఇలా..

- ఎగ్జిక్యూటివ్ పోస్టుల్లో అసిస్టెంట్ ఇంజనీర్ (ఈ అండ్ ఎం) ఈ–గ్రేడ్–2 పోస్టులు 24 ఉండగా, అసిస్టెంట్ ఇంజనీర్ సివిల్, ఈ–2 గ్రేడ్ పోస్టులు 4, వెల్ఫేర్ ఆఫీసర్ ట్రెయినీ గ్రేడ్–1 పోస్టులు 11, ప్రోగ్రామర్ ట్రెయినీ (ఐటీ)ఈ–1 గ్రేడ్ పోస్టులు 4, జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఈఅండ్ఎం) ఈ–1 గ్రేడ్ పోస్టులు 14, జూనియర్ ఎగ్జిక్యూటివ్ సివిల్ ఈ–1 గ్రేడ్ పోస్టులు నాలుగు ఉన్నాయి.
- నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టుల్లో జూనియర్ కెమిస్ట్/జూనియర్ టెక్నికల్ ఇన్‌స్పెక్టర్ టీఎస్ గ్రేడ్ ఇంటర్నల్ పోస్టులు 20, ఫిట్టర్ ట్రెయినీ కేటగిరీ–1 పోస్టులు 114, ఎలక్ట్రీషన్ ట్రెయినీ కేటగిరీ–1 పోస్టులు 22, వెల్డర్ ట్రెయినీ కేటగిరీ–1 పోస్టులు 43 ఉన్నాయని యాజమాన్యం నోటిఫికేషన్‌లో వెల్లడించింది.

ఎక్స్‌టర్నల్ పోస్టుల నోటిఫికేషన్ జాడేది?

సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు కంపెనీలో ఉన్న ఖాళీలను గుర్తించి ఎప్పటికప్పుడు నోటిఫికేషన్ ద్వారా పోస్టులు భర్తీ చేయాలని యాజమాన్యం ఆదేశించింది. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇక సంస్థలోని ఖాళీలను భర్తీ చేయడం ద్వారా ప్రస్తుత ఉద్యోగులు, కార్మికులపై భారం తగ్గించేలా క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించినా అమలుకు నోచుకోలేదు. జనవరి 30న ఏర్పాటుచేసిన సమావేశంలో 270 పోస్టులు భర్తీ చేస్తామని ఆనాటి డైరెక్టర్ చంద్రశేఖర్ వెల్లడించినా ఇప్పటికీ నోటిఫికేషన్ రాలేదు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి వీలైనంత త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

పంటే జీవితం..

దిగుబడి బాగా వస్తే చాలనుకునే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టే సమయంలో తమ ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయడం లేదు. చేతికి వచ్చిన పంటకు చీడపీడలు ఆశించకుండా మందు పిచికారీ చేసే క్రమంలో రైతులు ఆరోగ్యానికి ఇబ్బంది అని తెలిసినా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. కామేపల్లి మండలం గోవింద్రాలలో ఓ రైతు తన మిర్చి పొలంలో మందు ఇలా పిచికారీ చేస్తూ 'సాక్షి'కి కనిపించాడు.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్



మంత్రి పువ్వాడతో రామాలయ ఈఓ భేటీ



మంత్రిని సన్మానిస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలం/ఖమ్మం మయూరిసెంటర్: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం ఈఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రమాదేవి శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని సన్మానించాక, ఆలయంలో జరగనున్న శ్రీరామనవమి, పట్టాభిషేక మహోత్సవాలకు సంబంధించి చేపడుతున్న పనుల వివరాలను వెల్లడించారు. కాగా, ఏర్పాట్లలో వేగం పెంచాలని సూచించిన మంత్రి.. త్వరలోనే ఉత్సవ ఏర్పాట్లపై భద్రాచలంలో సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన ఎడ్ల పందేలు, కబడ్డీ పోటీలు

- ఎడ్ల పందేల్లో విజేతగా పల్నాడు జిల్లా రైతు
- కబడ్డీలో సత్తా చాటిన సూర్యాపేట జిల్లా జట్టు



కబడ్డీ ఫైనల్స్‌లో తలపడుతున్న సూర్యాపేట-ఖమ్మం జట్లు

నేలకొండపల్లి: ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువుమాధారంలో అంకమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగుడు పోటీలు, కబడ్డీ పోటీలు మూడు రోజుల పాటు ఉత్కంఠభరితంగా సాగాయి. శనివారం పోటీలు ముగియగా విజేతలకు ఆహుతులు బహుమతులు అందజేశారు. కబడ్డీ ఫైనల్ మ్యాచ్ సూర్యాపేట–ఖమ్మం జిల్లాల మధ్య ఉత్కంఠభరితంగా సాగగా సూర్యాపేట జట్టు విజేతగా, ఖమ్మం జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఇక ఎడ్ల పోటీల్లోని రెండు విభాగాల్లో పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం ఇనిమెట్లకు చెందిన బత్తుల చిన్నబ్బాయి, ఇదే గ్రామానికి చెందిన కటకం వెంకటేశ్వర్లు తీసుకొచ్చిన వృషభాలు మొదటి స్థానాల్లో సాధించాయి. కాగా, పోటీలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు హాజరుకాగా, విజేతలకు ప్రజాప్రతినిధులు నగదు బహుమతులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈవూరి సుజాత, ఎంపీటీసీ కనమర్లపూడి పుష్పలత, సొసైటీ చైర్మన్ పగిడిపత్తి శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఆకుల వెంకటేశ్వర్లుతో పాటు ఈవూరి శ్రీనివాసరెడ్డి, చొడం నాగేశ్వరరావు, యడవల్లి సైదులు, తుమ్మా ధనమూర్తి, కనమర్లపూడి రాము, పగిడిపత్తి బాలయ్య, అమరగాని యల్లయ్య, ఆకుల మల్లేశ్, శివారెడ్డి, రామచంద్రుడు, యడవల్లి చంద్రయ్య, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు

చర్ల: ఎస్టీ జాబితాలో 11 కులాలను చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అందరూ వ్యతిరేకించాలని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈమేరకు మండలంలోని చింతకుప్ప–దానవాయిపేట గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై శనివారం కరపత్రాలు వెలిశాయి. ఆదివాసీల వినాశనానికి తలపెట్టిన తీర్మానాన్ని రద్దు చేసే వరకు మిలిటెంట్ ఉద్యమాలు చేపట్టాలని అందులో పేర్కొన్నారు. ఈ తీర్మానం అమల్లోకి వస్తే సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన ఆదివాసీలకు రాజ్యాంగబద్ధంగా దక్కిన హక్కులు, చట్టాలు, రిజర్వేషన్లు దక్కకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీల మనుగడకు పెనుముప్పు ఉన్నందున హక్కుల రక్షణకు పోరాడాలని పిలుపునిచ్చారు.

కిన్నెరసానిలో సెంట్రల్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్



బోట్ షికారు చేస్తున్న డైరెక్టర్ చేతన్‌చౌహాన్

పాల్వంచ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని పర్యాటక కేంద్రమైన కిన్నెరసాని జలాశయాన్ని సెంట్రల్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ చేతన్‌చౌహాన్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బోట్ షికారు చేశారు. అనంతరం చౌహాన్ మాట్లాడుతూ కిన్నెరసాని ఎంతో ఆహ్లాదంగా ఉందని పేర్కొన్నారు.

సింగరేణి డిస్పెన్సరీల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలి



సీఎంఓతో మాట్లాడుతున్న జీఎం రమేశ్

సింగరేణి(కొత్తగూడెం)/సత్తుపల్లి: కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్, జేవీఆర్ ఓసీ డిస్పెన్సరీల్లో సౌకర్యాలు మెరుగుపర్చి కార్మికులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేశ్ కోరారు. శనివారం ఆయన కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ బి.వెంకటేశ్వరరావును కలిసి మాట్లాడారు. సింగరేణిలో కార్మికులే ప్రధానమైనందున, వారి ఆరోగ్య పరిరక్షణ కోసం డిస్పెన్సరీల్లో అన్ని మందులు అందుబాటులో ఉంచాలన్నారు. సత్తుపల్లి నుంచి కార్మికులు, వారి కుటుంబీకులు కొత్తగూడెం రావాలంటే ఇబ్బందిగా ఉన్న నేపథ్యాన అక్కడే చికిత్స అందేలా చూడాలని కోరారు. జీఎం వెంట ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రమణారెడ్డి తదితరులు ఉన్నారు.